# గలగలా గోదారి

## వైభవమ్

''భోం..భోం..'' అంటూ బోయీల మోత వినిపించింది. బుచ్చిరామయ్యగారి లోగిలి ముందు మేనా ఆగిందిరా తండ్రీ. ఆ మేనాలోంచి ఒక మెరుపు మెరిసి లోగిల్లోకి వెళ్ళిపోయింది. ఆ మెరుపు వయసు ఆరున్నొక్క దశాబ్దాల పైమాటే. లోపలికి అడుగుపెట్టిన మెరుపుకి, అక్కడ చేరిన జనం పక్కలకి ఒత్తిగిల్లి త్రోవిచ్చారు. వస్తున్న మెరుపుని అర నిమిషం చూసి, ''అప్పా'' అంటూ బావురుమని కౌగిలించుకుంది మరో పండు తమలపాకు. ఆ పండు తమలపాకుని పొదువుకుని వీపు నిమురుతూ బుచ్చిరామయ్యగారిని సమీపించిందిరా ఆ మెరుపు. ఆ కాంతి ముఖం మీదపడ్డ కొద్ది నిమిషాలకి బుచ్చిరామయ్యగారు కళ్ళు తెరిచి కమ్మగా నవ్వార్రా కన్నా. తాంబూలంతో పండిన నోటితో కస్తూరి సువాసనలు ఘుమఘుమలాడు తుండగా, వెయ్యి చంద్రుళ్ళని చూసిన - ఆ వేదవేత్త ముఖం రాగరంజితమయ్యేలా, పల్చగా పసిడితీగలా నవ్విందిరా ఆ మెరుపు. కనిపించని కన్నీళ్ళని తుడవ డానికి చాచిన అనుభవం పండిన ఆ చేతిని పరులకి తెలియనంత సుతారంగా ముంచించి, తన శిరస్సుని ఆ మహావృద్ధుని దక్ష పాదం మీద ఆన్చి, ఆ అరిపాదాన్ని నిమురుతూ అరమోడ్పులయ్యిందిరా ఆ విద్యుల్లత. వామపాదాన్ని నిమురుతూ, ఆ పండు తమలపాకు కూర్చునుంది గుండెల్లోంచి తన్నుకొస్తున్న దుఃఖాన్ని కళ్ళల్లోంచి ఒంపకుండా వుండడానికి ప్రయత్నం చేస్తూ.

బుచ్చిరామయ్యగారు సలక్షణమైనటువంటి ధార్మిక వంశంలో జన్మించారు. బ్రహ్మవేత్తలకు పుట్టినిల్లురా వారి వంశం. అవడానికి విశాలమైన మండువాలోగిలి అయినా, తరతరాలుగా అగణితమైన, అద్యంతరహితమైన వేద విద్యకి మూలకంబంలాంటిదిరా ఆ యిల్లూ, ఆ గడ్డ కూడాను. ఇల్లు అనేకన్నా ఆశ్రమం అంటే బావుంటుదేమో. ఆ ఆశ్రమ ప్రాంగణంలో ప్రభవిల్లుతున్న వృక్షజాతులు, నానావిధ కుసుమాలతో శోభిల్లుతున్న లతారాజములు, వేదంలా అమవానంగా వుంటూ వస్తున్నవేరా. వాటి ఆకుల కదలికలు కూడా వేదఘోషనే వినిపించేవిరా తండ్రీ. ఆటువంటి గడ్డలో, ఆ గృహంలో, ఆ బ్రహ్మ వంశంలో జన్మించిన బుచ్చిరామయ్యగారు వేదవేత్తలయ్యారు అంటే అవరురామరి.

గర్భాష్టమిలో ఉపనయనం జరిగింది బుచ్చిరామయ్యగారికి, ప్రాథమిక విద్యని పితృదేవుల దగ్గర అభ్యసించి, ఆ పైన గురుకులంలో ప్రవేశించారు. ఇరవై సంవత్సరాల ప్రాయం వచ్చేసరికి స్వశాఖ అయిన యజుర్వేదాన్ని, ఆ పైన అనర్ఘ రత్నమైన సామవేదాన్ని విద్యారణ్య భాష్యంతోసహా జీర్ణించుకున్నారు. మేఘ గంభీరమైన స్వరంతో ఆయన వేదపఠనం చేస్తూవుంటే ప్రకృతి యావత్తూ పులకించిపోయేదిరా. వింటున్న జనాల హృదయాలు పరవళ్ళు తొక్కేవిరా కన్నా. ఆ మహానుభావుడు అడుగుపెట్టని వేదపరిషత్తు వెల వెలబోయేదిరా. ఆయన రాక కోసం, ఆ నోట పలికే శబ్దాన్ని వినడం కోసం, ఉద్దండ పండితులు సైతం వెంపర్లాడిపోయేవారురా తండ్రీ. ఎక్కడైనాసరే, అగ్రతాంబూలం ఆయనదే. అయినా, ఆది గురువైన కన్న

## అగ్నిశిఖ

తండ్రి కనుసన్నల్లోనే మెలిగేవారురా. విద్యకు తగ్గ వినయం, వినయానికి సమతూకమైన రూపం, అంతకు మించిన స్వారస్యం సుగంధంలా అదృశ్య పరిమళాన్ని వెదజల్లుతూ వుండేదిరా.

ఆటువంటి బుచ్చిరామయ్యగారు రాజమహేంద్రవరంలో జరుగుతున్న వేదపరిషత్తుకి పితృదేవులతో కలిసి వెళ్ళడం తటస్థించింది. ఆ రోజుల్లో ప్రయాణానికి భగవద్దత్తమైన రెండు కాళ్ళే వుపకరణాలురా. మజిలీలు చేసుకుంటూ రాజమహేంద్రవరం చేరుకున్నారు. వారి రాకతో ఆ వేదపరిషత్తు జీవనదిని సంతరించుకుంది.

> ### వేళకు రాయని భాస్కరుడు
>
> సినీ రచయిత ఆత్రేయ పాటలు సమయానికి రాయక నిర్మాతల్ని, రాసి ప్రేక్షకుల్ని ఏడిపిస్తారని జనవాక్యం. ఇందుకు ఒక సంఘటన సాక్ష్యంగా చెప్పుకోవచ్చు.
>
> ఆత్రేయ హోటల్ 'హోళ'లో దిగి ఎంతకీ పాటలు రాయకపోతే సంగీత దర్శకుడు ఆలాపన కోసం కనీసం 'పల్లవి' అయినా రాయమని అర్థించాడు. అయినా ఆత్రేయ రాయలేదు. ఈసారి నిర్మాత అడిగాడు. దానికి ఆత్రేయ ''నిర్మాతగారూ! ఈ 'హోళ'లకు 'పల్లవు'లకు పడదు. కాబట్టి మరో మంచి హోటలకు మార్చండి. హోళ హోటల్‌లో వుండి 'పల్లవి' రాయడం కష్టం'' అన్నారు. అప్పటికే ఆ హోటల్ బిల్లు కొన్ని వేలు అయింది.
>
> \- హరిశ్చంద్రప్రసాద్

ప్రవచనాలు, పరీక్షలు, వ్యాఖ్యానాలు, వివరణలతో నయనానందకరంగాను, శ్రవణానందకరంగాను కూడా ఆ వేద పరిషత్తు భాసించిందిరా.

రాజమహేంద్రవరం ఆదినుంచి కూడా సాహితీ సమరాంగణ చక్రవర్తులకి, చతుష్షష్టి కళలకి, వాటిల్లో ఆరితేరిన కళావంతులకి ఆటపట్టుగా ప్రసిద్ధి కెక్కిందిరా. ఆ రాజమహేంద్రవరంలో కళావంతులలో కలికితురాయిలా రంగసాని ప్రభవిల్లేది. ఆటువంటి రంగసానికి కాంచనలత ఉన్నసార్థక నామధేయంతో ఒక మెరుపుతీగ ఉద్భవించి, ఈడేరి, చూపరుల హృదయాలకి ఆహ్లాదకరంగాను, రసికుల మనసులకి కల్లోల హేతువుగాను వుండసాగిందిరా. తగిన వరుణ్ణి చూసి కన్నెరికం చేయించాలని రంగసాని తహతహలాడసాగింది. సువర్ణం మీద ఆశతో ఆ సువర్ణ కుసుమాన్ని రసహీనుడి చేతిలో పెట్టదలుచుకోలేదురా ఆవిడ. తరతరాలుగా సంపాయించిన తరగని ఐశ్వర్యం రంగసానిది. ఎందరో రసిక శిఖామణులు పడిగాపులు పడుతున్నా ఎవరూ రంగసాని దృష్టిని ఆకట్టుకోలేకపోయార్రా. వయసులో వున్నప్పుడు కూడా రంగసానిని సమీపించడానికి మహారాజులకే ధైర్యం చాలేది కాదురా. ఆటువంటి రంగసానికి సహజ గంధంలాంటిదిరా కాంచనలత. సంగీత సాహిత్యాలు రెండూ కూడా ఆ అనాఘ్రాత కుసుమానికి సురభిళ సౌందర్యంలా స్వతస్సిద్ధాలురా తండ్రీ.

అటువంటి రంగసాని బుచ్చిరామయ్యగారి గురించి విని ఒక నిర్ణయానికి వచ్చిందిరా.

మహాపండితులచేత, ఉత్తమ కులసంభవులైన రావ కొమరులచేత కన్నెరికం జరిపించడం నాటి రివాజు. అక్కడ ధనంతో ప్రసక్తి లేదురా. ఆ విధంగా వారి ఔన్నత్యాన్ని గౌరవించడమేరా. సంఘం యొక్క ఆమోదముద్ర పరిపూర్ణంగా వుండేది వాడు. కాసుకి కక్కుర్తిపడడం అన్నది నాటి జనబాహుళ్యానికి తెలియక పోగా, అటువంటి వ్యక్తులు సంఘబాహ్యాలుగా పరిగణించబడేవారు.

అందుకని, దీపాలు పెట్టాక పళ్ళూ, తాంబూలాది యథోచిత సరంజామా తీసుకుని, పట్టుపరదాల మధ్య పసిడి వెలుగులా మేనాలో బయల్దేరిందిరా రంగసాని బుచ్చిరామయ్యగారి విడిదికి. రంగసాని మేనా ఆగేసరికి బుచ్చిరామయ్యగారు వారి పితృదేవులు బుచ్చి వెంకయ్యగారు విశ్రాంతిగా కూర్చుని వున్నారు. వారి చుట్టూ, వారి మాటలు వినడానికి వచ్చినవారున్నారు. పరిచారిక వెంటరాగా, బుచ్చి వెంకయ్యగారిని సమీపించి పళ్ళూ, తాంబూలం వారి పాదాల వద్ద వుంచి అంజలి ఘటించి, వినయాన్ని ప్రస్ఫుటిస్తున్న నృత్యభంగిమలో నిలబడిందిరా ఆ ప్రౌఢ. అక్కడ వున్నదీపాలన్నీ వెలవెలబోయేట్టు మేలిముసుగులో వెలిగిపోతున్న ఆ ఆగంతుక కేసి క్షణమాత్రం చూసి, పక్కనున్నవారికేసి ప్రశ్నార్థకాన్ని సారించారురా బుచ్చి వెంకయ్యగారు. వారునూ్నా రంగసాని గురించి యథోచితంగా వివరించారు. విషయం విన్న బుచ్చి వెంకయ్యగారి పెదవుల మీద మందహాసం అమృతాన్ని చిలికిందిరా తండ్రీ. ఒకసారి చుట్టూ

పరికించి బుచ్చిరామయ్యగారికేసి చూసి తల పంకించారురా. అప్పటికింకా బుచ్చిరామయ్యగారికి వివాహం కాలేదురా. అయినా అంతర్యాన్ని అర్థం చేసుకోలేని అమాయకులేమీ కాదు. అందుకే చేతులు శిరసుమీద జోడించి పితృదేవునికి ప్రణమిల్లారు. తమ చిరంజీవిని ఆశీర్వదించి లేవనెత్తి రంగసాని అందించిన తాంబూలాన్ని అందుకున్నారురా బుచ్చి వెంకయ్యగారు. సభ యావత్తూ "సాహో" అందిరా. పాదాభివందనం చేసి, ఆశీస్సునందుకుని మేనా ఎక్కిందిరా రంగసాని.

ఆ విధంగా తండ్రి అనుమతితో వేదఘోషల మధ్య అరుంధతిని వశిష్ఠులవారు చేపట్టినట్లు ఒక శుభ ముహూర్తాన కాంచనలతని చేపట్టారురా బుచ్చిరామయ్యగారు. ఆ తరువాత రంగసాని గుమ్మం ఎక్కే సాహసం ఏ నరుడూ చెయ్యలేదురా. అగ్నిశిఖలాంటి బుచ్చిరామయ్యగారు.

కన్నా, అలా ఆనందంగా రోజులు గడిచిపోతున్నాయిరా. చివరికి బుచ్చిరామయ్యగారు తుది ప్రయాణానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. వారి చూపులు వీధి గుమ్మం దగ్గర తారట్లాడుతూనే వున్నాయి. ఆ చూపుల భావాన్ని గ్రహించిన తనయులు తల్లిని చాటుకి పిలిచి,

"అమ్మా, పెద్దమ్మకి కబురు చేయాలేమో" అని అనడమూ జరిగింది. ఏం చెయ్యాలో తెలియని స్థితిలో వారి దగ్గరికి వెంకమ్మగారు రావడమూ, ఆమె అంతర్యాన్ని గ్రహించి నిండుగా నవ్వి వద్దన్నట్లు తల పంకించడమూ జరిగింది. సరిగ్గా అప్పుడే కాంచనలత అడుగుపెట్టడమూ, వారి కుడిపాదం మీద తల ఆనించి కూర్చోవడమూ జరిగిందిరా తండ్రీ.



బుచ్చిరామయ్యగారి స్పర్శతో పునీత అయిన కాంచనలత మేరువులా శోభించిందిరా. అపర శర్వాణే అయిందిరా. ఆ తల్లిని కన్నెత్తి చూడగలిగే ధిలాసా ఎవరికుంటుందిరా కన్నా.

బుచ్చిరామయ్యగారికి ముందు వీధి గుమ్మం చూడలేదురా ఆ మెరుపు తీగ. వారిచేత పాణిగ్రహణం చేయబడ్డాక ఆ అవసరమూ కనిపించలేదురా ఆ తల్లికి.


ఆ తరువాత, సాంప్రదాయకంగా గృహస్థాశ్రమాన్ని స్వీకరించారురా బుచ్చిరామయ్యగారు. అనాదిగా వస్తున్న వేదఘోష ఆ గృహాన్ని వదలలేదురా. శిష్యకోటి వేద విద్యని అందుకుంటూనే వుంది. రంగసాని మంచి వార్షికంగా కట్నం అందుతూనే వుంది. ఆ యిల్లాలి తదనంతరమూ కొనసాగుతూనే వచ్చింది. బుచ్చిరామయ్యగారి అంతర్యాన్ని తెలుసుకుని, వారికి ఏ అలసటా కలగకుండా, వారి గృహిణి వెంకమ్మగారూ మసులుకుంటూనే వుంది. నాలుగు వేదాల్లా పుట్టుకొచ్చిన నలుగురు కొడుకులూ ఆ తండ్రికి తగ్గ తనయులుగా గుర్తింపుని పొందారు. కాంచనలత గృహాన్ని సందర్భం తారసపడినప్పుడు పావనంచేస్తూనూ వున్నారు

ప్రకృతి పురుషుల మధ్య కబుర్లతో అవసరమేముందిరా కన్నా. వసంతకాలంలో కోకిల కూయడం ఎంత సహజమో, ప్రకృతి పురుషుడిలో ఒదిగిపోవడమూ అంతే సహజంరా. అందుకే మనసు పంపిన సందేశాన్నందుకుని అఖండ గౌతమిని దాటి అరనిమిషం కూడా అడుగుల్ని ఆపకుండా అలసటన్నది తెలియకుండా, గుక్కపట్టిన బోయీల "భోం" కారం "ఓం" కారం కాగా, తొంభై ఘడియల దూరాన్ని తొమ్మిది క్షణాలన్నంత వేగంగా పూర్తిచేసి బుచ్చిరామయ్యగారి పాదాల దగ్గర వాలిందిరా కాంచనలత.

ఎడమ అర్థపాదాన్ని నిమురుతున్న వెంకమ్మగారి చేతిని ఆ పాదం చల్లగా మంచు గడ్డలా తాకిందిరా. బిత్తరపోయిన వెంకమ్మగారు, గొంతుక దుఃఖంతో పూడుకుపోతుంటే, "అప్పా" అని కాంచనలతని వాటేసుకుందిరా. వన్నె తరగని ఆమె శరీరం, ముఖం మీద నిండు కుంకుమ బొట్టుతో అగ్నిశిఖలా వెలిగిపోతూ వుంటే, వెంకమ్మగారి చేతుల్లోంచి చల్లగా కిందికి జారిపోయిందిరా ఆ తటిల్లత.

అంతేరా కన్నా, అంతే!

# కాలమ్ దాటని కథ



"ఒరేయ్ పండూ! టి.వి.లో చిన్న బాబొచ్చాడు చూడు" నా మూడేళ్ళ మనవడిని పిలిచాను. వచ్చి చూశాడు.

"బాబెందుకు గుండు చేసుకున్నాడు?" వాడి ముద్దు మాటలతో అడిగాడు.

"వాళ్ళ నాన్న సెలూన్ దగ్గరికి తీసుకెళ్ళి గుండు చేయించేశాడమ్మా!" పండుగాడి నాన్న మొన్నోసారి వాడికి సమ్మర్ క్రాఫ్ చేయించేస్తే అందరం పెట్టిన చివాట్లు గుర్తొచ్చి అలా అన్నాను.

"ఎందుకు గుండు చేయించేశాడు?"

"బుద్ధి లేక."

"బుద్ధి ఎందుకు లేదు?"

"గడ్డి తిని."

"గడ్డి ఎందుకు తిన్నాడు?"

## ఎందుకు?

"ఆవు తినలేదు. అందుకని తిన్నాడు."

"ఆవెందుకు తినలేదు?"

"పాలికాపు విప్పలేదట."

"ఎందుకు విప్పలేదు?"

"వాళ్ళబ్బాయి ఏడ్చాడట."

"ఎందుకు ఏడ్చాడు?"

"చీమ కుట్టిందట."

"చీమెందుకు కుట్టింది?"

"పుట్టలో వేలుపెడ్తే కుట్టింది."

"పుట్టలో ఎందుకు వేలు పెట్టాడు?"

"ఏమోరా బాబూ! నాకు తెలియదు. కథ అంతవరకే వుంది."

"చెప్పు తాతయ్యా! పుట్టలో ఎందుకు వేలు పెట్టాడు?"

తలమీద కొట్టుకుంటూ "బుద్ధిలేక పెట్టాడ్రా బాబు. బుద్ధిలేక పెట్టాడు వేలు."

"ఎందుకు బుద్ధిలేదు?"

అయ్యబాబోయ్ కథ మళ్ళీ మొదటికొచ్చింది.

"ఏమేవ్! పండుగాడికి ఓ చాక్లెట్ యివ్వవే!"

కేక పెట్టాను. తుర్రుమన్నాడు వాడు లోపలికి.

"యక్ష ప్రశ్నలకైనా జవాబు చెప్పవచ్చేమోకానీ వీడి ప్రశ్నలకి మాత్రం సమాధానం చెప్పలేంరా బాబు" అనుకుని నిట్టూర్చాను.

— శారదారాజ్